# శిథిలాలయం

రాఘవస్వామి మనస్సు కొద్దిరోజులుగా బాగాలేదు. ఎంతసేపూ ఏదో ఆందో ళన. కల్లోలం, ఏదో తెలియని వ్యథ.

నిజం చెప్పాలంటే తమ్మునితో వేరుపడ్డనాటినుండీ శ్రీస్వామి మాన సికంగా చితికిపోయాడు. రామలక్ష్మణులవంటి సోదరులు వేరుపడ్డారంటే ఊరంతా నివ్వెరపోయింది. 'నరసయ్య భార్య ఇంత ఘటికురాలనుకోలేదు' అన్నారందరూ.

వాటాల వంపకంలో పైతృకమైన గృహంనరసయ్యకు వెళ్ళింది. గత్యం తరంలేక ఇల్లు తమ్మునికి అప్పగించి వచ్చి రాఘవస్వామి ఒక ఇంటి గదిలో కూర్చొని పసిపిల్లవానివలె కళ్ళకు నీళ్లు పెట్టుకున్నాడు. ఆ కొబ్బరిచెట్లు, మందార చెట్టు, దొడ్లో బాదంచెట్టు, పూజామందిరం. అందులో రామలక్ష్మణుల విగ్రహాలు.. రాఘవస్వామి మనస్సులో ఒక్కొక్కటీ మెదులుతున్నాయి. తమ్ముడు ఇల్లు అనుభవిస్తున్నందుకు తనకేమీ బాధలేదు. తన ఆస్తి సర్వస్వమూ కావాలన్నా సరే తమ్మునికే వదిలి లేచి వచ్చేవాడు. కాని ఆ ఇల్లు... ఆ ఇంటికీ తన జీవునికీ గల అనుబంధం. ఎవరికి తెలుస్తుంది? ఎలా తెలుస్తుంది??

రోజులు గడుస్తున్నాయి. రాఘవస్వామి పెద్దకొడుకూ, రెండవకొడుకూ, భార్యా. అంతా మామూలుగానే జీవితం గడుపుతున్నారు. కాని రాఘవస్వామి జీవితంలో ఏదో లోటు ఏర్పడింది! ఎవరూ తీర్చలేని లోటది!!

దీపావళి పండుగ వచ్చింది. నరసయ్య సున్నం రాళ్లు తెప్పించాడు. బండి, రాళ్ళను తెచ్చి నరసయ్య ఇంటిముందు కుప్పపోస్తున్నది. గలగలమని రాళ్ళ శబ్దం వినపడుతున్నది. అయితే ఎవరూ దానిని ప్రత్యేకంగా పట్టించు కోలేదు ఒక్క రాఘవస్వామి తప్ప, రాఘవస్వామి పసి కట్టాడు ఇంటికి సున్నం వేయడానికి రాళ్లు తెప్పిస్తున్నారని - రాఘవస్వామి చిన్న కొడుకును పిలిచాడు. 'అమ్మ నడగరా ! ఇంట్లో కుంకుళ్లు ఉన్నాయో, లేవో?'

'లేవ'ని వచ్చి చెప్పాడు కొడుకు.

వెంటనే బజారు పంపించి తలంటుకు కావలసిన వస్తువులన్నీ తెప్పించి, 'ఏమేవ్ ! తలంటుపోయ్యి - ఎన్నాళ్ళయిందో ఆముదం పెట్టుకొని తలంటు కొని -' అని కేకేశాడు. భార్య కళ్లు ఆర్ద్రమైనాయి. అవును ఎన్ని ఏళ్ళు అయిందో ఆయన శాస్త్రీయంగా తలంటుపోసుకొని - తలలో ముచ్చట ముడిలోని మల్లెపూలపలెనే కన్నీటి బొట్లను జార్చి ఆమె కలువల కన్నులుకూడా ఆ రాత్రి వికసించాయి -

పండుగనాడు ఇంట్లో షడ్రసోపేతమైన వంట చేశారు. రాఘవస్వామి ముందు పులిహోరా, పాయసం తమ్ముడింటికి పంపించాడు. చిన్న కొడుకు ఇచ్చి వచ్చాడు - వచ్చి 'అమ్మ మరి చిన్నమ్మ మా ఇంట్లో వండుకోలేదను కున్నారా ఏమిటి ? పంపించారు ? ? అని అన్నదే' అన్నాడు.

రాఘవస్వామి నవ్వాడు ఆ నవ్వుతోనే అబ్బా అని గుండె పట్టు కున్నాడు ... పెద్దకొడుకు సహాయంపట్టి మంచంమీద పడుకోబెట్టాడు....

శీతాకాలం చాలా దారుణంగా వుంది. ఎక్కడ చూచినా చలికంతాలే చలిమంటలే - మనుషులూ, జంతువులూ, జడమూ, చేతనమూ అంతా గజగజ వణికిపోతున్నారు . రాఘవస్వామికి పిత్రార్జితమైన తన ఇల్లు మంచులో తడిసి వెచ్చదనంకోసం సహాయం అడుగుతున్నట్లు అనిపించింది -

తనకు మాత్రం కుంపటి వుంది వెచ్చగా మంచం దగ్గర. కిటికీలో గుండా ఇంటిని చూస్తూ వున్నాడు. ఇంటి పైకప్పు సరిగా కనపడటంలేదు....కండ్లకు లోపం వస్తున్నదన్నమాట ఇప్పుడిప్పుడే .. ఇంటి పైకప్పు పై పెంకులు చెల్లా చెదురుగా వున్నాయి. మంచు బిందువులు చూరునుండి క్రిందికి రాలుతున్నాయి - చలికి గడ్డకట్టుకొనిపోయిన ఒక కాకి ముక్కును పెంకుకేసి అటూ ఇటూ రాస్తున్నది....వాకిట్లో బంతిపువ్వు అపరిణత స్త్రీ వలె, మంచుముద్ద వలె విచ్చుకో కుండా మూగవోయి నిలబడి అమాయికంగా చూస్తున్నది .. లోపల భజన మందిరం నుండి కీర్తన విన్పడుతున్నది - రాఘవస్వామి పెదవులపైనా ఏదో ఉచ్చారణ........

ఇంటిని అలాగే చూస్తున్నాడు రాఘవస్వామి....

ఏమి ఇల్లిది ! !

విచిత్రమైన ఇల్లు... ముడతలు పడ్డ ఇల్లు....శిథిలమౌతున్న ఇల్లు—పై కప్పు చెదిరిపోయిన ఇల్లు... ముసలిదైపోయిన ఇల్లు....

సూర్యుడు పైకి వచ్చాడు - వాకిట్లో బండి శబ్దం వినిపించింది. పెంకులను బండిపై తెప్పించి ఇల్లు కప్పుతున్నాడు తమ్ముడు. ఇంజక్షను ఇవ్వడానికి డాక్టరు లోనికి వచ్చాడు - ఆయన పిలుపుతో రాఘవస్వామి ఈ లోకానికి వచ్చాడు. ఇంజెక్షను ఇచ్చి వెళ్ళిపోయాడు - తిరిగి ఇంటివైపే చూడసాగాడు స్వామి.

--- ఒకనాడు పెద్ద కొడుకు వచ్చి చెప్పాడు 'నాన్నా! చిన్నాన్న ఇబ్బందులవల్ల ఇల్లు అమ్మాలనుకుంటున్నాడ'ని. వెన్నెముక విరిగినట్లనిపించింది రాఘవస్వామికి - తన్ను నడివీధిలో నిలబెట్టి ఎవరో అమ్ముతున్నట్లు అనిపించింది. అదిగో - కాశి - కొనడానికి వస్తున్నాడు వీరబాహువు - అవ్యక్తంగానే కేకేశాడు 'అమ్మడానికి వీలులేదు ' అని.

ఆరాత్రే తన పొలం తాకట్టుపెట్టి తమ్ముడికి డబ్బిచ్చాడు రాఘవస్వామి.

పెద్దకొడుకుకు నచ్చలేదీపని. అయినా ఏమీ అనలేదు. ఆశ్చర్యపోయింది నరసయ్య భార్య.

బ్రతిమలాడి చెప్పాడు రాఘవస్వామి 'తమ్ముడూ జీవితంలో ఎప్పుడూ అనకు ఆ మాట ఇక' అని.

ఎండాకాలం వచ్చింది.

సూర్యుడు నేలను బద్దలుచేస్తున్నాడు.

మానవాళిని సెగగాలులు తుకతుక ఉడికిస్తున్నాయి. - రాఘవస్వామి ఆరోగ్యం చెడిపోయింది. - కొడుకులిద్దరూ ఆందోళన చెందుతున్నారు - వట్టివేళ్ళతో గదిచుట్టూ ఆచ్ఛాదనలు ఏర్పాటుచేశారు.

రాఘవస్వామి మాత్రం కిటికీగుండా తన ఇల్లును చూస్తూనేవున్నాడు.

'ఏమిటి నాన్నా ఈ పిచ్చి?' పెద్దకొడుకు అడిగాడు ఒకనాడు

'ఆ పాత ఇంటిపై ఏమిటి మమకారం.'

"ఏం మాట అన్నావురా, శౌరీ! ఏదిరా పాత ఇల్లు! మీనాయన వాతవాడు కాదట్రా! సరైన పైకప్పు లేదు మూలస్తంభమైన వెన్నెముకవంగింది. గోడల

నుండి చౌడు రాలుతున్నది. ఇంట్లో రోగాల ఎలుకలూ పందికొక్కులూ కన్నాలు త్రవ్వివేసున్నాయి అ ఇంట్లో జీవులున్నారు - ఈ వంట్లో దేవుడున్నాడు. - శౌరీ - నీకేం తెలుసురా . నీకేంతెలుసు-" ఆవేశంలో ఇక మాట్లాడలేకపోయాడు.

"దేహం దేవాలయం ప్రోక్తం ..." ఏదో శ్లోకాన్ని అవ్యక్తంగా గొణుగుతున్నాడు .

ఆరాత్రే జరుగరాని దారుణం జరిగిపోయింది.నిప్పంటుకొని ఇల్లు తగలబడిపోయింది - నరసయ్య కుటుంబం వీధినిబడ్డది - నిప్పను ఆర్పేందుకు యంత్రాలు విఫలప్రయత్నం చేశాయి. రాఘవస్వామి ఏమీ మాట్లాడలేదు - నిర్లిప్తంగా ఊరుకున్నాడు - తెల్లవారుజామున రసయ్య వచ్చి చెప్పాడు - "అన్నయ్యా - ఇల్లు కాలిపోయింది" - అని-

రాఘవస్వామి అన్నాడు "అవును నాయనా కాలడం ఇంటి ధర్మం" అని. అంతా నివ్వెరపోయారు. ఈ జవాబుకు మళ్ళీ రాఘవస్వామే అన్నాడు "మా నాన్ననుండి వచ్చిన ఆస్తులు రెండు - అదిగో స్థిరాస్తి - ఇదిగో చరాస్తి -" గట్టిగా తెరలు తెరలుగా దగ్గుతూ అన్నాడు "కట్టిన ఇల్లును కాలమే కూలుస్తుంది - అది సహజం. కానీ ఈ మంటలనుండి దీపాలుకూడా వెలిగాయి నరసయ్యా - కాలానికి మనమిచ్చే కానుక అదే ..." ఇద్దరు కొడుకుల వైపూ చూచాడు - రాఘవస్వామి.

అర్థం కావడంలేదు. ఈయన మాటలు వాళ్ళకి....

ఏదో తెలియని భయం ఆవరించింది వాళ్ళని....

ఉదయం పది గంటలకల్లా ఊరి వెలుపల మరో ముసలి ఇంటికి నిప్పంటించాడు పెద్దకొడుకు.